సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



మార్కెట్లకు శ్రావణ శోభ!

శ్రావణ శుక్రవారం మహిళలంతా వరలక్ష్మి వ్రతం ఆచరిస్తారు. సిరిసంపదలు, అష్ట ఐశ్వర్యాలు, సౌభాగ్యాన్ని ప్రసాదించే ఈ వ్రతాన్ని ఆచరించడానికి సన్నద్ధమయ్యారు. -8లో



కృష్ణా, విశాఖ మ్యాచ్ డ్రా

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన కృష్ణా, విశాఖ మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేఎస్ఆర్ఎంలో నిర్వహించాల్సిన చిత్తూరు, కడప మ్యాచ్ వాయిదా పడింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 410 మెట్రిక్ టన్నులు



జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం



రాయచోటిలోని పోలీసు పరేడ్ మైదానంలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి. చిత్రంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు (ఇన్‌సెట్) జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి



- కూటమి అధికారంలోకి రాగానే పెన్షన్ పెంపు అమలు
- జిల్లా మీదుగా 8 జాతీయ రహదారుల నిర్మాణం
- జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాం
- 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ ధ్యేయమని, పలు పెండింగ్ పనులు పూర్తి చేయడంతోపాటు నూతనంగా అనేక రంగాల్లో జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.గురువారం ఉదయం రాయచోటిలోని పోలీసు పరేడ్ మైదానంలో ముందుగా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడులతో కలిసి మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే....78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నాం...జాతిపిత మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిరావుపూలే, అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్‌లతోపాటు ఎందరో అమర వీరులు చేసిన ఎనలేని త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. అన్నమయ్య జిల్లాకు చెందిన ఎర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి, బి.గంగ్రాయుడు, టి.చంద్రశేఖర్‌రెడ్డిలు బ్రిటీషు వారి సంకెళ్ల నుంచి విముక్తి కోసం ప్రాణాలను ఫణంగా పెట్టారన్నారు. ఈ సందర్భంగా వారందరినీ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అధికారంలోకి రాగానే పెన్షన్ల మొత్తం పెంపు

రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే పింఛన్ పెంపు హామీని నెర వేర్చా మన్నారు. రూ. 3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ. 4 వేలు చేసి, దివ్యాంగులకు రూ. 6 వేలు అందించామన్నారు. అన్నమయ్య జిల్లాలో 2.22 లక్షలకు పైగా లబ్ధిదారులకు జులై, ఆగస్టు 1వ తేదీనే దాదాపు రూ. 96 కోట్లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలోని నిరుపేదలకు కూడా రూ. 4.30 లక్షలతో పక్కాగృహాలు కట్టించి అందిస్తామన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో మూడు డి సిల్టేషన్ పాయింట్ల ద్వారా దాదాపు రూ. 5.15 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. జిల్లాలో నాలుగు అన్నా క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

- రవాణాశాఖ ద్వారా ఆర్టీసీకి సంబంధించి నూతన బస్సులను అందుబాటులోకి తీసుకు రావడం జరుగుతుందన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంలో భాగంగా మదనపల్లె–తిరుపతి రహదారిలో కొత్త ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులో ఉంచామన్నారు.
- జిల్లాలో పశు సంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత. జిల్లాలో పశుగ్రాస అభివృద్ధికి 75 శాతం రాయితీతో నీటి ఎద్దడిని తట్టుకునే అధిక పశుగ్రాస ఉత్పత్తి విత్తనాలను క్షేత్రస్థాయిలో రైతులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.మినీ గోకులాలు పథకం కింద పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు 90 శాతం రాయితీతో షెడ్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో జిల్లాలో పీఎం కిసాన్ కింద 1.73 లక్షల రైతు కుటుంబాలకు రూ. 34.64 కోట్లు అందజేశామన్నారు. అలాగే ఈ సీజన్‌కు సంబంధించి రూ. 5583 కోట్లు ఆర్థిక లక్ష్యానికి ఇప్పటికే రూ. 3141 కోట్ల పంట రుణాలను మంజూరు చేశామని తెలిపారు. జిల్లాలోని రైతులకు రూ.21 కోట్ల రాయితీతో 72,793 మంది రైతులకు 55 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 94 లక్షల రూపాయల రాయితీతో 5980 మంది రైతులకు పచ్చిరొట్ట, పిల్లిపెసర, జనుము విత్తనాలను అందించామన్నారు. జిల్లాలో 84 వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ముందుకు సాగుతున్నామన్నారు.
- జిల్లాలో మననీరు–మన సంపద అనేది రాష్ట్ర ప్రభుత్వ నినాదమని, నీటిని సంపదలా కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు.జిల్లాలోని పెద్ద, మధ్యతరహా ప్రాజెక్టులైన హెచ్ఎన్ఎస్ఎస్, వెలిగల్లు, పింఛా, ముదివీడు రిజర్వాయర్లు, చిన్నమండెం, రామాపురం లిఫ్ట్ స్కీమ్‌లకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాయచోటి, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని 3900 నివాస ప్రాంతాలకు 55 ఎల్‌పీసీడీ శుద్ధతాగునీటిని ఇంటింటికి కొళాయి ద్వారా అందించేందుకు రూ. 24 కోట్లతో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.
- జిల్లాలోని హార్సిలీహిల్స్‌కు ఒక ప్రత్యేక స్థానముందని, సీఎం ఆదేశాల మేరకు హార్సిలీహిల్స్‌ను ఒక పర్యాటక హబ్‌గా తయారు చేయనున్నామన్నారు.
- జిల్లాలో రూ. 6210 కోట్లతో 276 కిలోమీటర్ల మేర చేపట్టిన 8 జాతీయ రహదారుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.
- అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏర్పడిన రాయచోటి పట్టణాన్ని ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్న ఎంపీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,కలెక్టర్, అధికారులు, శాంతిభద్రతలు కాపాడుతున్న ఎస్పీ, పోలీసు సిబ్బంది, సత్వర న్యాయం అందిస్తున్న న్యాయమూర్తులు, పాత్రికేయులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.



రాణి రుద్రమదేవిగా చిన్నారి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాయచోటి: దేశ సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తూ కలికిరి సైనిక్ స్కూల్ చేసిన నృత్యాలు, దేశభక్తిని ప్రేరేపించాయి. సంబేపల్లె కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు జయహో చక్ దే ఇండియా పాటలకు ఎంతో ఆత్మవిశ్వాసంతో పిరమిడ్ ఆకృతిలో చేసిన విన్యాసాలు, సుండుపల్లె కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాడవోయి భారతీయుడా అంటూ దేశభక్తిని ప్రదర్శిస్తూ చేసిన బృందం, నృత్యం ఆకట్టుకున్నాయి. జేఎన్‌టీయూ ఎస్ కలికిరి విద్యార్థినులు దేశ సరిహద్దుల్లో ప్రాణలొడ్డి రక్షణగా నిలుస్తున్న సైనికుల వీరోచిత విన్యాసాలను ప్రదర్శించిన తీరు ప్రశంసలు అందుకుంది. చిన్నమండెం మండలం, వల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు దేశ్ రంగీలా పాటకు చేసిన నృత్యం అందరిలో ఉత్సాహాన్ని నింపింది.

సాంస్కృతిక బహుమతులు......

రాయచోటి ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ప్రథమ, సుండుపల్లె కేజీబీవీ స్కూల్‌కు ద్వితీయ, కలికిరి సైనిక్ స్కూల్, సంబేపల్లె కేజీబీవీ స్కూల్‌కు సంయుక్తంగా తృతీయ బహుమతిని అందజేశారు.ప్రగతి శకటాల ప్రదర్శనలో రాయచోటి మున్సిపాలిటీకి ప్రథమ , గ్రామీణ నీటి సరఫరా శాఖకు ద్వితీయ , రవాణ శాఖ వారికి తృతీయ బహుమతి ప్రదానం చేశారు.



సుండుపల్లి కేజీబీవీ విద్యార్థుల ప్రదర్శన







శకటాల ప్రదర్శనలో భాగంగా వ్యవసాయ శాఖ ఎద్దుల ప్రదర్శన, రాయచోటి మున్సిపల్ శాఖ శకటం, రవాణా శాఖ శకటం

శకటాల ప్రదర్శన

స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి శకటాలను ప్రదర్శించారు. మైన్ ప్రొటెక్టెడ్ వాహనాలు, వ్యవసాయ శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్, జిల్లా విద్యాశాఖ–సమగ్ర శిక్ష, రాష్ట్ర రవాణశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), గ్రామీణ నీటి సరఫరా సంస్థ (ఆర్‌డబ్ల్యుఎస్) శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, 108, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఉద్యానవన, సూక్ష్మ నీటిపారుదల శాఖల ప్రగతి శకటాలు ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న జాగిలాలు..

వేడుకల్లో పోలీసు జాగిలాల ప్రదర్శన అందరినీ ఆకట్టుంది. పోలీసు జాగిలాలు రాజా, జూలీ, జాకీ, మ్యాగీలు చేసిన హార్డిల్ జంప్, నేరస్తుల వదిలివెళ్లిన వస్తువులను పట్టుకోవడం, పేలుడు పదార్థాలను, నేరస్తులను గుర్తించడం, ఎర్రచందనం వాహనాల గుర్తింపు, స్టైంట్ జంప్, తదితరాలు చూపర్లను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి.



పోలీసు జాగిలాల ప్రదర్శన

సమరయోధుల కుటుంబాలకు సత్కారం

రాయచోటి: స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతులమీదుగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి సీనియర్ సిటిజన్లు, సుండుపల్లె మండలానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధులు ఎర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి కుమారుడు వై శివరామరెడ్డి, రామాపురం మండలానికి చెందిన సుద్దమల్ల నాగమ్మలను మంత్రి సత్కరించారు.

- 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో భాగంగా రూ.267.99 కోట్ల విలువైన ఆస్తులను మంత్రి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు.అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి సందర్శించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శాఖ ద్వారా బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీ నిధి మహిళల జీవనోపాధుల నిమిత్తం 4422 మంది లబ్దిదారులకు రూ.264.38కోట్లు, పరిశ్రమల శాఖ తరపున స్టాండ్ ఆఫ్ ఇండియా, పీఎంఈజీపీ కింద రూ.3.55 కోట్లు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా 18 మందికి బ్యాంకు రుణం వీల్‌ఛైర్లు, వినికిడి యంత్రాల కింద రూ.6.25 లక్షలు పంపిణీ చేశారు.



స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్



కలెక్టర్ ఏర్పాటు చేసిన అట్ హోం కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు

ఉల్లాసంగా 'అట్‌హోమ్'

రాయచోటి టౌన్ : స్వాతంత్య్ర దినోత్సవాలను పురస్కరించుకుని స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఉల్లాస భరిత వాతావరణంలో 'అట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, రాంజపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా, రాయచోటి ఆర్‌డీవో రంగాస్వామి, డీఆర్‌వో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నమ్మి నడిచిన టీచర్లకు వెన్నుపోటు!

'ప్రభుత్వ జీవో 117 రద్దు చేస్తాం...టీచర్ల మనోభావాలను గౌరవిస్తాం. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తాం' ఎన్నికలకు ముందు ఎన్డీయే కూటమి నేతలు ఇలా ప్రతి సందర్భంలోనూ ప్రకటించారు. నారా లోకేస్ ఏకంగా టీడీపీ ప్రధాన కార్యదర్శి హోదాలో జీవో–117 రద్దు చేయాలంటూ లేఖ ఇచ్చారు. దీనిని ఉపాధ్యాయులంతా నమ్మారు.. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించారు. సీన్ కట్ చేస్తే అధికారంలోకి రాగానే వారికి వెన్నుపోటు తప్పడం లేదు. 2024 మే, 31 నాటికి వైఎస్సార్ జిల్లాలో 647 ఖాళీలున్నట్లు వివరించారు. ఇంతలోనూ సర్‌ప్లస్ పేరుతో మిగులు టీచర్లు 590 మంది ఉన్నారంటూ లెక్కలు కట్టారు. టీచర్ల సర్దుబాటును తెరమీదకు తెచ్చారు. మెగా డీఎస్సీ ప్రకటిస్తామన్న మాటల్లో డొల్లతనం తేటతెల్లమవుతోంది. - సాక్షి ప్రతినిధి, కడప



- నాటి జీఓ 117 ఎత్తేస్తామని ప్రకటించిన నారా లోకేష్
- తాజాగా ప్రత్యేక కేటగిరీ టీచర్లపై అమలు చేసి చూపిస్తున్న వైనం
- జిల్లా వ్యాప్తంగా 590 టీచర్లు మిగులు ఉన్నట్లు ప్రాథమిక అంచనా

సర్ ప్లస్ ఉపాధ్యాయులను గుర్తించిన పాఠశాలలు	413
మొత్తం సర్ ప్లస్ ఉపాధ్యాయులు	590
సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు	365
స్కూల్ అసిస్టెంట్లు	201
లాంగ్వేజ్ పండిట్లు	24

గ్రామీణులకు మెరుగైన విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం శరణ్యమని భావించింది. అప్పట్లో ప్రభుత్వ నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ.. అధికారంలోకి రాగానే తద్భిన్నంగా వ్యవహరిస్తోంది. ఉపాధ్యాయ సంఘాలతో ఎలాంటి చర్చ లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోంది. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ తెరపైకి తెచ్చింది. తొలుత పదిమంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇలా చేస్తే ఒక్క వైఎస్సార్ జిల్లాలోనే 305 పాఠశాలలు మూతపడనున్నట్లు సమాచారం. టీచర్లు ఆందోళన చేయడంతో వెంటనే తగ్గి ఆ నిర్ణయాన్ని రద్దు చేసుకున్నారు. తాజాగా డబుల్ టీచర్లు ఉన్న పాఠశాలలను సింగిల్ టీచర్ పాఠశాలగా మార్చి మిగులు టీచర్లను చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 590 మంది సర్‌ప్లస్ టీచర్లు ఉన్నట్లుగా విద్యా శాఖ అంచనాకు వచ్చినట్లు సమాచారం. అయితే మెగా డీఎస్సీ దేవుడెరుగు.. కనీసం ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని.. తర్వాతే సర్దుబాటు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. చిత్తశుద్ధి ఉంటే తెలుగు మీడియం సెక్షన్లు ప్రవేశపెట్టి విద్యార్థులకు విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సర్దుబాటు కాదు.. దిద్దుబాటు ముఖ్యం



ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి లోకేష్ చర్చించి ఎన్నికల హామీని అమలు చేయాలి. 117 ఉత్తర్వులు రద్దు చేయాలి. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలో 3, 4, 5వ తరగతుల విలీనాన్ని నిలిపేయాలి. సర్దుబాటు కాదు.. దిద్దుబాటు ముఖ్యం.
– సంగమేశ్వరరెడ్డి, ఎస్టీయూ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి

సర్దుబాట్లు ఆపేయాలి



ఉపాధ్యాయ సర్దుబాట్లకు శాస్త్రీయత లేదు. జీవో 117, దాని అమైన్మెంట్ జీవో 128లను రద్దు చేసి 53 జీవో ప్రకారం సర్దుబాటు చేయాలి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. – జమాల్‌రెడ్డి, అధ్యక్షుడు, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం

పదోన్నతుల తర్వాతే వర్క్ అడ్జస్ట్‌మెంట్



117 ఉత్తర్వులతో వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను వెంటనే ఆపాలి. విద్యా శాఖ మంత్రి అధికారికంగా ఉపాధ్యాయ సంఘాలన్నింటితో చర్చలు జరపాలి. అక్టోబర్‌లో పదవీ విరమణ పొంది ఖాళీ ఏర్పడబోతున్న పాఠశాలలో వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు అధికారులు శ్రీకారం చుట్టడం అన్యాయం. – సివి ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి, ఏపీటీఎఫ్

పచ్చపెత్తనం

- దళిత మండల వైస్‌ప్రెసిడెంట్‌పై దౌర్జన్యం
- కొట్టండి..చంపండి..అంటూ ఎంపీటీసీ భర్త ఆగ్రహావేశం
- ప్రభుత్వం మాది..అంతుచూస్తామంటూ టీడీపీనేత బెదిరింపులు



దళిత మండల వైస్‌ప్రెసిడెంట్ అనుదీప్(వృత్తంలో ఉన్న వ్యక్తి)పై దాడి చేస్తున్న మేడా విజయశేఖర్‌రెడ్డి, పెంచలయ్య

నందలూరు: రాష్ట్రంలో అధికారపార్టీ దురంహకారం.. దౌర్జన్య సంఘటనలు కోకొల్లలు..చివరికి పంద్రాగస్టు రోజు కూడా టీడీపీ నేతల పెత్తనం విమర్శలకు దారితీసింది. ఎటువంటి ప్రొటోకాల్‌లేని నేతలు తమకు తెలియకుండా అన్నమయ్య జిల్లా నందలూరు ఎంపీడీఓ క్యాంపస్‌లో ఒక దళిత ప్రజాప్రతినిధి, యువ న్యాయవాది (నాయనపల్లె అనుదీప్, మండల ఉపాధ్యక్షుడు) మువ్వన్నల జెండా ఎగురువేసినందుకు పచ్చమూకలు రెచ్చిపోయాయి. టీడీపీ పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి కొంతమందిని వెంటవేసుకొని ఎంపీడీఓ క్యాంపస్‌లోకి వచ్చి తనచేత జెండా ఎగురవేయించకుండా ముందుగానే దళితుడిచేత ఎగురవేయించారని నిలదీశారు. ఈయనకు తోడు ఓ ఎంపీటీసీ భర్త (టంగుటూరు) పెంచలయ్య రౌడీయిజం ప్రదర్శించారు. దళితప్రజాప్రతినిధి నాయనపల్లె అనుదీప్(నాగిరెడ్డిపల్లె హరిజనవాడ)ను కొట్టండి..చంపండి అంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. పోలీసులు వారించినా ఆయనను ఎవరూ ఆపలేకపోయారు. ఎన్నికల ముందు పార్టీలో చేరిన నేతల వైఖరి చూసి పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న వారు మండిపడుతున్నారు. జనంలో పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని వాపోతున్నారు. వివరాలు.. అన్నమయ్య జిల్లా నందలూరు ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమం 8.30కు నిర్వహించనున్నట్లు ముందుగానే మండలపరిషత్ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. అయితే ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో మండల ఉపాధ్యక్షునిగా ఉన్న నాయనపల్లె అనుదీప్, మరో మండల ఉపాధ్యక్షురాలు తుమ్మలభావన చేతుల మీదుగా ప్రొటోకాల్ ప్రకారం జెండా ఎగురవేశారు. అయితే 9 గంటల ప్రాంతంలో టీడీపీ నేత విజయశేఖర్‌రెడ్డి,ఆయన వెంట వచ్చిన పచ్చమూకలు జెండా ఎగురవేశారని తెలుసుకొని, తాము లేకుండా ఏ విధంగా ఎగురవేస్తారని ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ దళితనేతలు పెనుబాలనాగసుబ్బయ్య, కాకిచంద్ర, నందలూరు నేతలు సోమిశెట్టి ప్రభాకర్, అరిగెల నానిల సమక్షంలో మండల ఉపాధ్యక్షునితో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వాదులాట, తోపులాటతో దౌర్జన్యానికి దిగారు. ఎంపీడీఓ క్యాంపస్ నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వెళ్లి పోవాలని, ఇక్కడికి రాకూడదు. ప్రభుత్వం మాదంటూ బెదిరించగా, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరగబడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులను పంపించివేశారు. టీడీపీ తాజా నేతలు అనుసరించిన వైఖరిపై మండలపరిషత్ అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

క్లుప్తంగా

కృష్ణా, విశాఖ మ్యాచ్ డ్రా


92 పరుగులు చేసిన కృష్ణా బ్యాట్స్‌మన్ శ్రీ నిశ్చయ్


4 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ యువన్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఆర్‌-ఏసీఏ మైదానంలో నిర్వహించిన కృష్ణా, విశాఖ మ్యాచ్ డ్రాగా ముగిసింది. 144 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు గురువారం బరిలోకి దిగిన కృష్ణా జట్టు 68.2 ఓవర్లలో 240 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శ్రీనిశ్చయ్ 92 పరుగులు, ధనుష్ 38 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు యువన్ 4, రోహిత్ 3, రచిత్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 34.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. జట్టులోని ప్రితిక్‌వర్మ 58, పరమ్‌వీర్‌సింగ్ 51 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో విశాఖ జట్టు 480 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ లభించింది. కాగా కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించాల్సిన చిత్తూరు, కడప మ్యాచ్ శుక్రవారానికి వాయిదా పడింది.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు, వి.రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం గ్రామాల పరిధిలో గత మూడు రోజులుగా వ్యవసాయ విద్యుత్ మోటార్ల విద్యుత్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. అనంతపురం పంట పొలాల్లో బుధవారం రాత్రి విద్యుత్ మోటార్ల వైర్లు చోరీకి గురైనట్లు గురువారం ఉదయం రైతులు గుర్తించారు. దీని కంటే ముందు రెండు రోజులు వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో 30 మంది రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ తీగలను గుర్తు తెలియని దుండగలు అపహరించుకుపోయినట్లు రైతులు గుర్తించారు. ఖాజీపేట మండల పరిధిలోని తుడుములదిన్నెలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని కొందరు దొంగలు విద్యుత్ మోటార్ల వద్ద వైర్లు దొంగిలిస్తుండగా స్థానిక ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన జరిగిన రెండు రోజుల్లో చాపాడు మండలంలోని వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం గ్రామాల పరిధిలో ఇలాంటి దొంగతనాలే జరగడం గమనార్హం. విద్యుత్ వైర్ల చోరీపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లారీ, టిప్పర్ ఢీ

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న టిప్పర్

చింతకొమ్మదిన్నె : కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని వేపమాను సత్రం వద్ద బుధవారం తెల్లవారుజామున టిప్పరు-లారీ ఢీకొన్నాయి. రూరల్ సీఐ శివశంకర్ నాయక్ తెలిపిన సమాచారం మేరకు కోనంపేట గ్రామం నుంచి టిప్పర్ కడపకు కంకర లోడుతో వస్తుండగా, కడప వైపు నుంచి రాయచోటికి వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సిద్దవటం మండలం చొడేశ్వరిపేటకు చెందిన టిప్పర్ డ్రైవర్ పెద్దారెడ్డి చంద్రారెడ్డి (57) తీవ్రంగా గాయపడగా అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

125 మీటర్ల జెండా ప్రదర్శన

బి.కొత్తకోటలో గురువారం స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు 125 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జ్యోతిచౌక్ వరకు విద్యార్థులు జెండాను ప్రదర్శనగా తీసుకురాగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

– బి.కొత్తకోట


బి.కొత్తకోటలో జాతీయ పతాకం ప్రదర్శన

ట్రాఫిక్ ఏఎస్‌ఐకి ఇండియన్ పోలీస్ మెడల్

మదనపల్లె : పట్టణ ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న ఏఎస్‌ఐ జేఎస్‌ఏ.బాషా ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. విజయవాడలో జరిగిన 78వ స్వాతంత్య్ర వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, నిబద్ధతకు పట్టం కడుతూ ఈ మెడల్ వరించింది. అవార్డుకు ఎంపికైన ఏఎస్‌ఐ జేఎస్‌ఏ. బాషాను డీఎస్పీ కొండయ్యానాయుడు, ట్రాఫిక్ సీఐ కృష్ణయ్య, సిబ్బంది అభినందించారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ఏఎస్‌ఐ బాషా

విశేష సేవలకు విశిష్ట పురస్కారం


మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డ్రగ్స్ కంట్రోల్ అధికారి జయరాముడు

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలు, పలు సంస్థల ఆధ్వర్యంలో ఆయా రంగాల్లో విలువైన సేవలు అందించిన వారికి స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అధికారులు ప్రశంసాపత్రాలు అందజేసి గౌరవించారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 78వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు తదితరుల చేతుల మీదుగా వీరు ఈ ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వారి వివరాలు ఇలా..


కలెక్టరేట్ ఏఓ నాగభూషణం
జిల్లా రిజిస్ట్రార్ మునిశంకరయ్య
జిల్లా ఎండోమెంట్ అధికారి సి.విశ్వనాథ్
జిల్లా రవాణా శాఖ అధికారి భరత్‌చౌహాన్
పంచాయతీరాజ్ ఈఈ దయాకర్‌రెడ్డి
జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి ప్రసన్నకుమార్
డీపీఓ ధనలక్ష్మి
ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి సహదేవరెడ్డి
జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి
జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ
జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి త్యాగరాజు
రాయచోటి హాస్పిటల్ సూపరింటెండెంట్ డేవిడ్‌సుకుమార్
మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి
జిల్లా ఫైర్ అధికారి అనిల్‌కుమార్
జిల్లా డ్వామా అధికారి మద్దిలేటి
డీఆర్‌ఓ సత్యనారాయణరావు
రాయచోటి ఆర్డీఓ రంగస్వామి
డీఎఫ్‌ఓ శుభం
డీ అండ్ పీఆర్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి
ఎస్పీ సీసీ ఉదయ్‌కుమార్
అడిషనల్ ఎస్పీ సీసీ భాగ్యరాజ్
ఎస్‌బీ సీఐ సత్యనారాయణ
రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు
ఓబులవారిపల్లి ఎస్‌ఐ మహేష్
ఏఆర్ ఆర్‌ఎల్ చలపతి
ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ
సీఐ వెంకటేశ్వర్లు
సీఐ భాస్కర్
సీఐ శంకరమల్లయ్య
రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామంలో తూర్పుపల్లె క్రాస్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఎ.రెడ్డిప్రసాద్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడితో పాటు కిషన్‌కర్మకర్ అనే వ్యక్తి మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాయచోటి మండలం కదిరివాండ్లపల్లె పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రెడ్డిప్రసాద్ గురువారం విధులకు వెళ్లేందుకు కిషన్‌కర్మకర్ అనే వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో మరో ద్విచక్రవాహనంలో వెళ్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన కూలీలు అబునసీమ్, షేక్ హుసేన్ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రెడ్డిప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా కిషన్‌కర్మకర్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రెడ్డిప్రసాద్, కిషన్‌కర్మకర్

బైకు, కారు ఢీ

ఇద్దరికి గాయాలు

రాయచోటి టౌన్ : రాయచోటి – రాజంపేట రోడ్డులోని బండ్లోళ్లమిట్ట మలుపు వద్ద బైకు-కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేట పట్టణంలోని రిలయన్స్ మార్ట్‌లో పనిచేసే సూర్యప్రకాష్, షణ్ముఖాచారి గురువారం రాయచోటికి మార్ట్ పని మీద వచ్చి తిరిగి ఇంటికి బైకుపై బయలుదేరారు. ఇదే సమయంలో సీతంపేట బూడిదకుంటపల్లెకు చెందిన వ్యక్తులు కారులో రాయచోటికి వెళుతున్నారు. బండ్లోళ్లపల్లె మిట్టలోని మలుపు వద్దకు రాగానే కారు, బైకు ఢీ కొన్నాయి. దీంతో బైకుపై వెళుతున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. బాధితుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఇదేమి దౌర్భాగ్యం!

కురబలకోట : ప్రజాప్రతినిధులున్నా పార్టీ నియోజక వర్గ స్థాయి టీడీపీ నాయకుడు జాతీయజెండాను ఎగురవేసి అందర్ని ఆశ్చర్యచకితుల్ని చేశారు. అధికార, ప్రజాప్రతినిధులు నివ్వెరపోవాల్సి వచ్చింది. వివరాలలోకి వెళితే..గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించారు.

కురబలకోట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వేడుకలకు స్థానిక జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఇతర మండల అధికారులు హాజరయ్యారు. ఈ వేడుకల్లో నియోజకవర్గ టీడీపీ నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. సాధారణంగా స్వాతంత్య్ర వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఎగురవేయడం పరిపాటి. అలాంటిది ప్రజాప్రతినిధులున్నా ఓ పార్టీ నాయకుడు జెండా ఎగుర వేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదేమి దౌర్భాగ్యమంటూ పలువురు చర్చించుకున్నారు.


కురబలకోట ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి

లారీని ద్విచక్రవాహనం ఢీకొని..

ఇటుకబట్టీ కార్మికుడు దుర్మరణం

మరొకరి పరిస్థితి విషమం

మదనపల్లె : ముగ్గురు ఇటుక బట్టీ కార్మికులు ద్విచక్ర వాహనంలో వస్తూ లారీని ఢీకొనడంతో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన గురువారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది.

పట్టణంలోని నీరుగట్టువారి పల్లె, గజ్జల కుంటకు చెందిన వెంకటరమణ కుమారుడు నరసింహులు(29), కృపలకోట మండలం సర్కారు తోపు బండపల్లెకు చెందిన రఘు కుమారుడు దినేష్(20), అదే గ్రామానికి చెందిన తిరుమలేష్ (25), సర్కారు తోపు వద్ద ఉన్న ఓ ఇటుక బట్టీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి దినేష్, తిరుమలేష్ ఇద్దరు కలిసి మదనపల్లెకు వచ్చి నరసింహులును వెంటబెట్టుకుని ఇటుక బట్టీ వద్దకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలోని చొడేశ్వరి కల్యాణ మండపం వెనకవైపున చంద్ర కాలనీ అనపగుట్ట మలుపు వద్ద, లారీ రివర్స్ చేస్తుండగా, ఇటుక బట్టీ కార్మికులు వేగంగా ద్విచక్ర వాహనంలో వచ్చి లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను వెంటనే మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరసింహులు ఆసుపత్రిలో మృతి చెందాడు. తిరుమలేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. దినేష్ స్థానిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కాగా మృతి చెందిన నరసింహులుకు భార్య సుస్మిత, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దుర్మరణం చెందిన ఇటుక బట్టీ కార్మికుడు నరసింహులు


తీవ్రంగా గాయపడిన తిరుమలేష్


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దినేష్

మార్కెట్లకు శ్రావణ శోభ!

వరలక్ష్మి వ్రతానికి అంతా సిద్ధం

మదనపల్లె సిటీ : శ్రావణమాసం రెండో శుక్రవారం మహిళలంతా వరలక్ష్మీవ్రతం ఆచరిస్తారు. సిరిసంపదలు, అష్ట ఐశ్వర్యాలు, సౌభాగ్యాన్ని ప్రసాదించే ఈ వ్రతాన్ని ఆచరించడానికి సన్నద్ధమయ్యారు. ఈ శుభవేళ పూజా సామగ్రి విక్రయాలతో జిల్లాలోని మార్కెట్లు కళకళలాడాయి. మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండు, శ్రీ కృష్ణదేవరాయ సర్కిల్, నీరుగట్టువారిపల్లె, చిత్తూరు బస్టాండు, నిమ్మనపల్లె క్రాస్ ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండ్లు, పూల దుకాణాల వద్ద మహిళల రద్దీ విపరీతంగా ఉండింది. ఫ్యాన్సీ షాపుల్లో అమ్మవారి ప్రతిమలు కొనుగోలు చేశారు.

ఆకాశాన్నంటిన పూలు..

పూల ధరలు ఆకాశాన్నంటాయి. మల్లెపూలు కిలో రూ.1200 పలికాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మల్లెపూల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. రోజాలు కిలో రూ. 300, చామంతి కిలో రూ.250, బంతులు కిలో రూ.200 పలికాయి. ఏ పూలు చూసినా ధరలు విపరీతంగా పెంచేశారు. అరటి, దానిమ్మ, బత్తాయి, సపోటతో పాటు ఇతర పండ్ల ధరలు కూడా రెండింతలు పెరిగాయి. మామిడి ఆకులు, అరటి మొక్కలు కొనుగోలు చేశారు.


మదనపల్లె పూలమార్కెట్‌లో సందడి


బెంగళూరు బస్టాండులో కొనుగోలుదారుల సందడి

బాకీ డబ్బులు రాలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : అప్పు తీసుకున్న వారు తిరిగి ఇవ్వని కారణంగా కాసారపు చిన్న వెంకటసుబ్బయ్య (43) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెన్నానగర్‌కు చెందిన చిన్న వెంకటసుబ్బయ్య కూలి పని చేసుకోవడంతో తన వద్ద ఉన్న డబ్బును వడ్డీలకు ఇచ్చేవాడు. అప్పు తీసుకున్న కొందరు వ్యక్తులు తిరిగి ఇవ్వకుండా అతన్ని ఇబ్బంది పెడుతూ వస్తున్నారు. ఈ బాధతో అతను మద్యానికి బానిసయ్యాడు. డబ్బు విషయమై భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో గురువారం చిన్నవెంకటసుబ్బయ్య దూరపు బంధువుల దినఖర్మకు వెళ్లొచ్చాడు. తర్వాత మద్యం తాగి అతను ఇంటికి వెళ్లాడు. రావాల్సిన డబ్బు రాలేదని భార్య శిరీషాకు బాధపడుతూ చెప్పాడు. పిల్లలకు కూడా లేకుండా అందరికీ ఎందుకు అప్పు ఇచ్చావని భార్య భర్తతో చెప్పింది. ఈ క్రమంలో ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత చూసుకోగా ఫ్యాన్‌కు తాడు కట్టుకొని ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసుకునేలోగా అతను మృతి చెందాడు. భార్య శిరీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటి పల్లి గ్రామ సమీపంలోగల స్మశాన వాటికలో బుధవారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ సీఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. పశువుల కాపరుల సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించగా మృతుడు పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. ఇతనిది కడప నగరంలోని మరియాపురం కాగా, తన తోటి కార్మికులైన శ్యామ్, దినేష్‌లతో బుగ్గలేటిపల్లిలోని ఓ సమాధికి పెయింట్ వేసేందుకు పని ఒప్పించుకున్నాడు. మృతుని శరీరంపై రక్తపు గాయాలు ఉండగా, పక్కనే మద్యం బాటిళ్లు ఉండడంతో అతిగా మద్యం సేవించి మృతి చెంది ఉంటాడా లేదా తోటి కార్మికులతో వాదులాటకు దిగి ఘర్షణలో మృతి చెంది ఉంటాడా అనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోర్న్ వీడియోలు, డ్రగ్స్‌ను నిషేధించాలి

ప్రొద్దుటూరు క్రైం : మహిళలపై అత్యాచారాలు, హత్యలను ప్రేరేపిస్తున్న పోర్న్ వీడియోలు, మద్యం, డ్రగ్స్‌ను నిషేధించాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ తెలిపారు. మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం శివాలయం సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పసి పిల్లలు మొదలుకొని ముసలి వారి వరకు మహిళలకు ఇంటా బయట రక్షణ లేదన్నారు. ఇందుకు నంద్యాల జిల్లాలోని ముచ్చుమర్రిలో కొందరు మైనర్ బాలురు మైనర్ బాలికపై చేసిన అత్యాచార ఘటనే నిదర్శనమన్నారు. అత్యాచారాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అత్యాచారాలు జరగడానికి మొబైల్ ఫోన్లలో లభిస్తున్న అశ్లీల వీడియోల వెబ్‌సైట్‌లే ప్రధాన కారణమని చెప్పారు. ఏరుల్లా పారుతున్న మద్యం, యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి కారణమని అనేక కేసుల్లో పోలీసులు నిర్ధారించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, జామాతే ఇస్లాం మహిళా అధ్యక్షురాలు రెహానా, రాయలసీమ విద్యార్థి శక్తి కన్వీనర్ వడ్ల హరిత, మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ ఎస్పీ మహమూద్, రచయిత జింకా సుబ్రమణ్యం, ఏపీ ఎన్జీఓ సంఘం మహిళా విభాగం చైర్ పర్సన్ జయమ్మ, జనవిజ్ఞాన వేదిక సురేష్, జయచంద్ర, శ్రీనివాసులరెడ్డి,

రాజంపేటలో ముచ్చటగా ముగ్గురు సీఐల బది'లీలలు'!



రాజంపేట పోలీసు స్టేషన్

రాజంపేట : రాజు తలుచుకుంటే కొరడాదెబ్బలకు తక్కువా అన్న చందంగా రాజంపేట పట్టణ పోలీసు స్టేషన్ సీఐల బదిలీల వ్యవహారం ఉంది. తాజాగా గురువారం సీఐగా రైల్వేకోడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.యల్లంరాజును నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే...ఇక్కడ సీఐగా పనిచేస్తున్న మద్దయ్య ఆచారి ఆకస్మికంగా బదిలీ అయ్యారు. రాజంపేట మున్సిపల్ కమిషనర్ నల్లా రాంబాబుపై టీడీపీ వర్గీయులు దౌర్జన్యం చేసిన సంఘటనకు సంబంధించి ఆయన నేరుగా రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన సంగతి తెలిసింది. అయితే సీఐ మద్దయ్య ఆచారి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా తాత్సారం చేశారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీంతో సబ్‌కలెక్టర్ వైఖోమ్‌నైదియా సీఐను పిలిపించి కమిషనర్ కేసుపై ఆరా తీశారు. దీనికి ఆయన నుంచి సరైన రీతిలో సమాధానం రాకపోయేసరికి ఆమె జిల్లా ఎస్పీకి సీఐపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. రాజంపేటకు కర్నూలు రేంజ్ డీఐజీ వచ్చిన సందర్భంలో సీఐ మద్దయ్య ఆచారి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతరం కదిరి సీఐ వెంకటేశ్వర్లును రాజంపేట టౌన్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. మళ్లీ ఈయన స్థానంలో కడప తాలుకా సీఐ వెంకటనాగరాజును సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతలోనే గురువారం వెంకటనాగరాజు స్థానంలో రైల్వేకోడూరు సీఐను నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గత వారం రోజుల్లో వరుసగా ముగ్గురు సీఐలను బదిలీ చేసి తాజాగా నాలుగో సీఐని నియమించడంపై రాజంపేటలో బదిలీల గురించి పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. రాజంపేట టీడీపీలో ఎవరికివారు తామే పార్టీ ఇన్‌చార్జి అని ప్రభుత్వ శాఖలపై పెత్తనం చెలాయించిన ఫలితమే ఏకంగా ముగ్గురు సీఐల బదిలీ వ్యవహారం అనే విమర్శలు వెలువడుతున్నాయి.